క్లుప్తంగా

పెట్రోల్ బంకుల తనిఖీ



పెట్రోల్ నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ వలిబాషా

ఆదోని రూరల్ : పట్టణంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వలిబాషా ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 18 పెట్రోల్ బంకులు ఉండగా, ఇప్పటివరకు 8 పెట్రోల్ బంకులను తనిఖీ చేశామని, మిగిలిన వాటిని త్వరలోనే తనిఖీ చేస్తామని చెప్పారు. శనివారం పట్టణంలోని తిమ్మారెడ్డి బస్‌స్టాప్ సమీపంలోని లక్ష్మీకాంత్‌రెడ్డి పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. బాత్రూమ్స్, తాగునీరు, ఉచిత గాలి సదుపాయం, కార్బన్‌డై యాక్సైడ్ సిలిండర్, రిజిస్ట్రేషన్, రికార్డ్స్, పెట్రోల్, డీజిల్ నాణ్యత, ధరల పట్టికను పరిశీలించారు. ఫైర్ సేఫ్టీపై మరింత నాణ్యత పెంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదేని ఫిర్యాదులకు 1967 కమాండ్ కంట్రోల్‌కు డయల్ చేయాలని కోరారు.

నేడు ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతి

ఆదోని అర్బన్ : పట్టణంలోని శ్రీపేట వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ఆదోని డివిజన్ జంగమ సమాజసేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంత్యుత్సవం ఉంటుందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురునాథయ్య మహర్షి, విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. వేకువజాము నుంచి శ్రీపేట వీరభద్రేశ్వరస్వామి, శ్రీరేణుకాచార్యుల మూర్తులకు రుద్రాభిషేకం, అనంతరం జంగమ వటులకు అయ్యాచార కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం రేణుకాచార్యుల పంచలోహ విగ్రహం ఉత్సవ మూర్తి ఊరేగిస్తామని, కుంభం, కలశం, డోలు, బాజాభజంత్రీ, నందికోలు, వీరగాసే, కోలాట తదితర వాద్యములతో సాగుతుందని చెప్పారు. కార్యక్రమానికి పాల్కూరు, చౌకీమఠం, జంగమరహోసళ్లి, హిరేమఠం, కల్లుమఠం, పీఠాధిపతులు చెన్నవీరశివాచార్యా, శివయోగి శివాచార్య, గురుసిద్ధ మహాస్వాములు పాల్గొంటారని వివరించారు.

నమూనా బ్యాలెట్ విడుదల



నమూనా బ్యాలెట్ పత్రాలను విడుదల చేస్తున్న జయమనోజ్‌రెడ్డి

ఆదోని టౌన్ : స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టభద్రుల నమూనా బ్యాలెట్ పత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ బలపరిచిన వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యతనిచ్చి గెలిపించాలని కోరారు. అనంతరం మండలంలోని కపటి, పెసలబండ, మాంత్రికి, దొడ్డనగేరి, జాలిమంచి, పెద్దతుంబళం, కుప్పగల్, బల్లేకల్, కడేకల్, సాంబగళ్లు, చిన్నపెండేకల్, ఆరేకల్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు మధుసూదనశర్మ, నాయకులు చలపతి, సన్నీ, వినోద్‌రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

శ్రీ మఠంలో తెలంగాణ హైకోర్టు జడ్జి



దర్శనానికి వస్తున్న జడ్జి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు తెలంగాణ హైకోర్టు జడ్జి వెంకటేశ్వరరెడ్డి శనివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు మఠం అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.

ఘనంగా గ్యార తారీఖ్ వేడుకలు



సమాధి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కౌతాళం: స్థానిక ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గ్యారతారీఖ్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో పాల్గొనడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావచ్చారు. దీంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. స్వామి వారికి సమాధి వద్ద ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. సాయంత్రం చదివింపులు, నాతేషరిఫ్‌లు, సలాముల ఆలపన చేశారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు

పేదల సొంతింటి కల సాకారాన్ని ప్రభుత్వం భుజాన వేసుకుంది. ఇందులో భాగంగా ఇళ్ల స్థలాలతో పాటు నిర్మాణాలకు కేటాయించిన లే అవుట్లలో సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ఇప్పటికే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. లబ్ధిదారులకు అవసరమైన నీరు, విద్యుత్, రోడ్లు తదితర వసతులు కల్పిస్తోంది.ఇప్పటికే దాదాపు అన్ని కాలనీల్లో నీటి వసతి కోసం బోర్లు వేయించింది. అలాగే విద్యుత్ సౌకర్యం పూర్తి చేసింది. కొన్ని చోట్ల రోడ్లు వేస్తుండగా నిర్మాణదారులు ఇంటి పనులు వేగంగా చేస్తున్నారు.

- రూ. వంద కోట్లతో మౌలిక వసతులు
- రోడ్లు, కాలువలు, విద్యుత్ సౌకర్యం, నీటివసతి ఏర్పాటు
- లబ్ధిదారులకు అనుగుణంగా సిమెంట్, స్టీల్, ఇటుక, ఇసుక నిల్వలు

మండిగిరి లే అవుట్‌లో బేస్‌మెంట్ లెవెల్‌లో ఇళ్ల నిర్మాణాలు





ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు



ఆదోని లే అవుట్‌లో రోడ్డువేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: నవరత్నాలు–అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలతో పక్కా ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.వంద కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. రోడ్లు, కాలువలు, నీటివసతి, విద్యుత్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. లబ్ధిదారులకు అనుగుణంగా పక్కా ఇళ్ల నిర్మాణం పనులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం ఇసుక, సిమెంట్, ఇటుకలు భారీగా నిల్వ ఉంచింది. దీంతో పేదలు ఇళ్లను కట్టుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. లబ్ధిదారుల ఆసక్తితో ప్రభుత్వ ఆశయం నెరవేరబోతోంది. దీర్ఘకాలికంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కల సాకారం కాబోతోంది. మండిగిరిలో ఉన్న ఎనిమిది లేఅవుట్లలో 120 ఎకరాల్లో జగనన్న కాలనీ ఏర్పాటు కాబోతోంది. 10,280 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అందులో మొదటి విడతలో 5,101 మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు. 500 మంది ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం లెంటల్ లెవెల్‌లో పనులు జరుగుతున్నాయి. మరో 300 ఇళ్లు బేస్ మెంట్ లెవెల్‌లో పనులు సాగుతున్నాయి. ఈ లేఅవుట్‌లో పనులు వేగంగా సాగుతుండటంతో జిల్లాలోనే వేగంగా పూర్తయ్యే కాలనీగా పేరుగాంచింది.

రూ.వంద కోట్లతో మౌలిక వసతులు

- జగనన్న కాలనీలో వసతులు కల్పనకు ప్రభుత్వం రూ.వంద కోట్లు కేటాయించింది. ఇందులో ఆదోని డివిజన్‌లో 35 లే అవుట్‌లలో విద్యుత్ సౌకర్యానికి రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- 40 కి.మీ. మేర ఇంటర్నల్, ప్రధాన రోడ్ల నిర్మాణాలకు రూ.12.11 కోట్లు వెచ్చిస్తున్నారు. తాగునీటి సౌకర్యం కోసం రూ.8.75 కోట్లు కేటాయించారు. అందులో ప్రస్తుతం ఆరు బోర్లు వేశారు. బోర్లలో నీరు కూడా సమృద్ధిగా పడ్డాయి. ఆ బోర్ల ద్వారా ఇళ్ల నిర్మాణాలు, ఇటుకలకు క్యూరింగ్, గోడల క్యూరింగ్‌కు వినియోగిస్తున్నారు.

జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నా



ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం స్థలమిచ్చి రుణ సాయం చేసింది. ఇంటిని నిర్మించుకునేందుకు అన్ని రకాల వసతులు కల్పిస్తోంది. మేం త్వరలో పనులు పూర్తి చేసి సొంతింట్లో చేరి మాకల నెరవేర్చుకుంటాం. ఇందుకు చేయూతనిచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– లోకేశ్వరి, గృహిణి, విక్టోరియాపేట

పనులు వేగంగా జరుగుతున్నాయి



ఆదోనిలో పక్కా ఇళ్ల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. నాణ్యత ప్రమాణాల్లో రాజీలేదు. ప్రతి రోజూ ఇటుకలను క్యూరింగ్ చేస్తున్నాం. క్యూరింగ్ చేసిన ఇటుకలతోనే నిర్మాణం పనులు చేపడుతున్నారు. 5,101 ఇళ్ల నిర్మాణ పనుల్లో సుమారు వెయ్యి ఇళ్లు బేస్‌మెంట్, ప్రింత్ బీమ్ స్థాయిలో పనులు జరుగుతున్నాయి. 11 వేల ఇటుకలతో పని జరుగుతోంది. సిమెంట్ 14,267 బస్తాలు, 10 వేల టన్నులు స్టీల్, ఇసుక 2 వేల టన్నులు నిల్వ ఉంచాం. మరో 8 వేల టన్నుల ఇసుక కావాలని ప్రతిపాదనలు పంపాం.

– రవికుమార్, హౌసింగ్ డీఈ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కౌతాళం: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తోనే సాధ్యమని, ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పర్యటించి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలకు వెళ్లి రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట జిల్లా రైతు విభాగపు అధ్యక్షుడు అత్రితనయగౌడు, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ



రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న ప్రదీప్‌రెడ్డి

బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు ఏకాంబర్‌రెడ్డి, సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ అవతారం, బసవరాజు, చెన్నప్ప ధని, భీమేష్, రాజ్‌అహ్మద్, ఇద్రుస్, వడ్డెరాము,లింగన్నగౌడ్, అనిల్, సర్పంచులు, ఎంపీటీలు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు సమష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు.

కోసిగి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్ర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుందామని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తుంబిగనూరు, సాతనూరు, అగసనూరు, కందుకూరు, కడదొడ్డి, కామన్‌దొడ్డి, ఆర్లబండ, దుద్ది గ్రామాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెట్టన గౌడ, దుద్ది నాగేష్, కామన్‌దొడ్డి నరసింహులు గౌడ, దుద్ది రామలింగ, సాతనూరు చంద్ర, అగసనూరు సర్పంచ్ ఉలిగయ్య, కందుకూరు తాయన్న, ఎంపీటీసీ మల్లయ్య, ఆకాష్ రెడ్డి, యంకే నాగేష్, టీకే భీమన్న పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

ఆదోని అర్బన్ : ఈనెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెగ్యులర్ విజిట్‌లో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయులకు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్థానికసంస్థల ఓటర్లకు బూత్ ఏర్పాటు చేశామన్నారు.సెయింట్‌జోసెఫ్ పాఠశాల, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఉంటాయన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా క్రిమినల్ రౌడీ షీటర్‌లను బైండోవర్ చేస్తున్నామని చెప్పారు. అలాగే లైసెన్సు తుపాకులను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. సీఐ శ్రీరామ్, సిబ్బంది ఉన్నారు.



త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

పట్టణంలో సీసీ కెమెరాల పునరుద్ధరణకు మున్సిపల్ కౌన్సిల్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించినందుకు గాను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డికి డీఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

ఖోఖో పోటీల విజేత కోసిగి

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదోని జోన్ ఆంతర్ పాఠశాలల బాలుర ఖోఖో పోటీలను జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పోటీలను అసోసియేషన్ జిల్లా కోశాధికారి పీడీ ఖలీల్ అహ్మద్, హెచ్‌ఎం కృష్ణమూర్తి ప్రారంభించారు. పోటీలకు ఆదోని డివిజన్‌లోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా జరిగిన పోటీల్లో కోసిగి జట్టు విజేతగా నిలిచింది.ద్వితీయ స్థానంలో ధనాపురం, తృతీయ స్థానంలో చిన్నభూంపల్లి, నాలుగో స్థానంలో బదినేహాల్ ఉన్నత పాఠశాలల జట్లు నిలిచాయి. విజేత జట్టుకు కోసిగి సాయి మోటార్స్ నిర్వాహకుడు అనుమేష్ మెడల్స్, కప్పను అందజేశారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ వ్యాయమ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి నరసింహా రాజు, పీఈటీలు శ్రీరామ్, చెన్నబసవ, గంగాధర, పెద్ద మాబాషా, వెంకటేశ్వర్లు, రామచంద్ర, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలు, కేశవ్ పాల్గొన్నారు.




గెలుపొందిన జట్టుకు కప్ అందజేస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం

ఆదోని అర్బన్ : ఇద్దరు నిరుపేదలకు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ శనివారం ఆర్థిక సాయం చేశారు. పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన వీరేష్ కుటుంబానికి రూ.5వేలు, అదే కాలనీకి చెందిన ఎరుకల సిద్ధప్ప కోడలు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెకు రూ.2వేలు అందజేశారు.ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మలేకర్‌వవాస్, పట్టణాధ్యక్షుడు మహాదేవ, కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు



కౌతాళం: మండలంలోని వివిధ ఆలయాల్లో ఆంజనేయస్వామికి శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సుళేకెరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయ స్వామి దేవాలయంలో, అగసలదిన్నెలోని ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారం కావడంతో భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బుదుములదొడ్డిలో సీతారాములకు ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తులకు రథోత్సవం జరిపించారు. అలాగే మండల కేంద్రంలోని వేంకటేశ్వర, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేపట్టారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

కౌతాళం: వైఎస్సార్ బీమా పేదలకు వరమని కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ కామవరం గ్రామ సీనియర్ నాయకుడు వీరసేనరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కామవరం గ్రామంలో గతేడాది అక్టోబర్‌లో విద్యుత్ షాక్‌తో మహబుబ్‌బాషా మృతి చెందాడు. నామిని అయిన మృతుడి తల్లి శేకున్‌బీకి వైఎస్సార్ బీమా కింద రూ.5లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. మృతుడి కుటుంబానికి ఈ మొత్తం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టడం వైఎస్సార్ కుటుంబానికే సాధ్యమన్నారు. బీమా మొత్తం ఇప్పించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, విద్యుత్ అధికారులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.



తన బ్యాంకు ఖాతాలో రూ.5లక్షలు జమయ్యాయని చూపుతున్న శేకున్‌బీ

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న డీఈఓ

ఆదోని రూరల్ : మండలంలోని కపటి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు డీఈఓ రంగారెడ్డి శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల హెచ్‌ఎం డి.వెంకటేశ్వర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం వల్ల జనవరి 6న సస్పెండ్ చేశామన్నారు. సీనియర్ ఉపాధ్యాయుడు నాగరాజుకు బాధ్యతలు అప్పజెప్పాలని తాము ఆదేశించినప్పటికీ తమ ఆదేశాలను హెచ్‌ఎం బేఖాతారు చేసి 8వ తరగతి విద్యార్థులకు అందజేయాల్సిన ట్యాబ్‌లను, పాఠశాలకు సంబంధించిన రికార్డులను తన గదిలో ఉంచి తాళం వేసుకుని వెళ్లిపోయాడన్నారు. ఎంత నచ్చజెప్పినప్పటికీ ఆయన వినకపోవడంతో శనివారం పంచనామా నిర్వహించి గది తాళాలు తొలగించి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు చెప్పారు. పీఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు, వీఆర్వో ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



బాధితులకు సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : మండలంలోని దొడ్డనగేరిలో శుక్రవారం తాయప్ప, ఈరమ్మ దంపతుల గుడిసె దగ్ధం కావడంతో తీవ్రంగా నష్టపోయారు. స్పందించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్ రెడ్డి శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాధితులకు 50 కేజీల బియ్యం, 10 కేజీల కందిబేడలు, కారం, నూనె తదితర నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. అనంతరం పట్టణానికి చెందిన నరసమ్మ, మునిస్వామి దంపతుల కుమార్తె గౌరీ వివాహానికి తాళిబొట్టు, పెళ్లి బట్టలను అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ గురునాథ్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్ : పట్టాదరు పాసుపుస్తకాలు, అడంగల్, ఆర్ఓఆర్ ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయడానికి కొందరు వీఆర్ఓలు రూ.5వేల నుంచి రూ.10వేలు డిమాండ్ చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా సహాయ కార్యదర్శి రాజు మాట్లాడారు.ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మనీ, ఐఎఫ్టీయూ నాయకుడు ప్రసాద్, పీడీఎస్‌యూ నాయకుడు అఖండ, రసూల్, వెంకట్, శేఖర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

పంచాయతీ కార్యదర్శిగా చంద్రశేఖర్



కోసిగి: మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో విధుల్లో చేరారు. ప్రస్తుతం ఆదోని మండిగిరి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుండగా కోసిగి మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

ఆదోని రూరల్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ గీతావాణి ఆదేశించారు. మండలంలోని మదిరె గ్రామంలో శనివారం పర్యటించారు. ముందుగా గ్రామంలోనున్న ప్రభుత్వ పాఠశాలలో అమలవుతు అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం జగనన్న కాలనీల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. అలాగే గ్రామ సచివాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, హౌసింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అనంతపురం వెళ్లి పింఛన్ అందజేత



రూతమ్మ నుంచి వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ గీతమ్మ

ఆదోని టౌన్ : పట్టణంలోని 37వ వార్డు మాధవరం రోడ్డులో నివాసముంటున్న వృద్ధురాలు రూతమ్మ అనారోగ్యం కారణంగా అనంతపురంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ గీతమ్మ శనివారం అక్కడికి వెళ్లి పింఛన్ అందజేసింది.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ఆదోనిటౌన్ : కుప్పగల్–కోసిగి రైల్వే స్టేషన్‌ల మధ్య 510/10–12 కి.మీ. రాయి వద్ద శనివారం సాయంత్రం హెచ్.జయరాజ్ (49) అనే వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపారు. మృతుడు కౌతాళం మండలం ఎరిగేరి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని చెప్పారు. కుప్పగల్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగి పట్టాలు దాటుతుండగా వెనక నుంచి వస్తున్న గుర్తు తెలియని గూడ్సు రైలు ఢీకొని మృతిచెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

20 మంది బైండోవర్

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని 20 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరిపై పోలీసు నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

గుజరాత్‌లో ఆదోని వాసి మృతి

ఆదోని అర్బన్ : పట్టణంలోని జీరంగిపేటకు చెందిన సిద్ధార్థ్ (36) అనే వ్యక్తి గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. శనివారం బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. బ్యాంకు ఉద్యోగిగా చేస్తూ శుక్రవారం గాంధీనగర్‌లో బైకుపై వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం మృతదేహం ఆదోనికి రానుందన్నారు.

కోసిగిలో ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పి.మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కర్నూలు అమిలియో హాస్పిటల్ సౌజన్యంతో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అప్తమాలజిస్ట్ రమేష్ వివిధ గ్రామాలకు చెందిన కంటి చూపు మందగించిన వారికి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్‌కు అవసరమైన వారిని కర్నూలు హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన గౌడ, మాణిక్యరాజు, వక్రాని వెంకటేశ్వర్లు, కోసిగయ్య, రాజేష్ పాల్గొన్నారు.